క్లుప్తంగా

రేపు శ్రీవారి కల్యాణ మహోత్సవం

వరికుంటపాడు: స్థానిక వైకుంఠపురంలోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పీ సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ



బిట్రగుంట: బోగోలు పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (లోకల్ ట్రెయినింగ్ సెంటర్)లో చెత్త నిర్వహణ, సంపద సృష్టిపై పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులు, పంచాయతీ సిబ్బందికి శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులుగా హాజరైన డీఆర్పీ శ్రీనివాసులురెడ్డి గృహాల నుంచి చెత్తను సేకరించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం, వర్మికంపోస్ట్ తయారీ, పశుపక్ష్యాదుల దహనవాటిక నిర్వహణ, పచ్చదనం పెంపొందించడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నయూంతాజ్‌హాసన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు ఆటో బోల్తా



ఉదయగిరి: ట్రక్కు ఆటో అదుపు తప్పి కాలువలో బోల్తాపడిన ఘటన మండలంలోని గండిపాళెంలోని ఆనంద ఆశ్రమం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పామూరు నుంచి ఉదయగిరి వైపు చిత్తుకాగితాల లోడ్‌తో వెళ్తున్న ఆటో గండిపాళెం గ్రామసమీపంలో అదుపు తప్పి పక్కనున్న పంట కాలువలో పడిపోయింది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను కాపాడారు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. శనివారం ఉదయం ఆటోను జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఆటో పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



కలిగిరి: మండలంలోని క్రాకుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులను ప్రసాదించాలని సరస్వతీదేవిని వేడుకున్నారు. గ్రామానికి చెందిన పీఎంపీ ఎస్‌కే హజరత్‌వలి 'శుభదిన్ భోజన్' కార్యక్రమంలో భాగంగా విందు భోజనాన్ని అందజేశారు.

పోలీసు స్టేషన్ తనిఖీ



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులను పరిష్కరించాలని సూచించారు. ఏఎస్‌పేటలో సీసీ కెమెరాల పనితీరును ఎస్సై సైదులును అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులకు సీసీకెమెరాల ప్రయోజనాలపై అవగాహన కల్పించి దుకాణాల్లో ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

ఉదయగిరి/సీతారామపురం: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించినట్లు ఉదయగిరి, సీతారామపురం తహసీల్దార్లు సుభద్ర, పీవీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. 2019 అక్టోబర్ 16వ తేదీకి ముందుగా ఇంటిని నిర్మించుకుని ఉండి స్థలాలపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లుగా చెప్పారు. 150 చదరపు గజాలలోపు ఇల్లు నిర్మించుకుని ఉంటే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. 150 నుంచి 300 చదరపు గజాలలోపు నిర్మించుకుని ఉంటే తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి భూమి విలువలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం రాయితీని అందజేస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో నెలకు రూ.10 వేలలోపు ఆదాయం కలిగిన వారు అర్హులని తెలిపారు. అర్హులైన వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాలగర్భంలో కలుస్తున్న బావులు

- విచ్చలవిడిగా బోర్ల ఏర్పాటు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఏటా తగ్గిపోతున్న వర్షాలు
- ప్రశ్నార్థకంగా భావితరాల మనుగడ

జలదంకి: భావితరాలకు బావులంటే తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. పుస్తకాల్లో, ఫొటోల్లో చూసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రెండు, మూడు దశాబ్దాల క్రితం గ్రామాల్లో బావులే ప్రధాన నీటి వనరులుగా ఉండేవి. రైతులు పంటలు పండించుకునేందుకు బావులు ఉపయోగపడేవి. దిగుడు బావులు, చేద బావులు తాగునీటి సమస్యను దరిచేరనిచ్చేవి కావు. భూగర్భజలాల పెంపునకు బావులు ఎంతగానో ఉపయోగపడేవి. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బావులు కనుమరుగై విచ్చలవిడిగా బోర్ల తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఏయేటి కాయేడు వర్షాలు కూడా తగ్గుతున్నాయి.

సేద్యం అనగానే ఒకప్పుడు గుర్తుకు వచ్చేది బావి. 20, 30 ఏళ్ల క్రితం సాగుకు ప్రధాన ఆధార వనరులుగా బావులు ఉండేవి. ప్రతి గ్రామంలో పది నుంచి 15 వరకు వ్యవసాయ బావులు ఉండగా నేడు ఒక్కటి కూడా కనిపించడం లేదు. వాటి స్థానాన్ని బోర్లు ఆక్రమించాయి. గతంలో పొలాల్లో బావులు తవ్వించుకుని అందులోని నీటి ద్వారా పంటలు పండించేవారు. అప్పట్లో వర్షాలు కూడా సమృద్ధిగా కురిసేవి. దీంతో బావులు నీటితో కలకళలాడడమే కాకుండా భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడేవి. వర్షాలు తగ్గిపోవడం, బోర్ల తవ్వకాల పుణ్యమా అని బావులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఫలితంగా పంటలకు నీరు అందే పరిస్థితులు లేవు. రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు వందల అడుగుల లోతుకు బోర్లు తవ్విస్తున్నా నీటి జాడ కనిపించడం లేదు. బోర్ల తవ్వకాల పేరుతో రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా బావులు ఉన్నా వాటిలో నీరు లేక శిథిలం చేస్తున్నారు.



జలదంకిలో యూనియన్ బ్యాంకు వద్ద చుక్కనీరు లేని బావి

వేలల్లో బోర్లు

ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు తొమ్మిది వేలకుపైగా బోరుబావులు ఉన్నాయి. ఏటా వర్షాలు తగ్గుతున్నా బోర్లు తవ్వడం ఆగడం లేదు. ప్రస్తుతం ప్రతి రైతు బోరు ఏర్పాటు చేసుకుని వ్యవసాయ చేయాలని చూస్తున్నాడు. అయితే ఏటా వర్షాలు తగ్గిపోతుండడంతో బోర్ల నుంచి నీరు సక్రమంగా రావడం లేదు. అయినా ఆశతో రైతులు అప్పులు చేసి బోర్లు తవ్విస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం భూగర్భజలాల పెంపునకు, పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్లు, పంట సంజీవని, నీరు–చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు దోపిడీ అవుతున్నాయే తప్ప ఎక్కడా భూమిలోకి జలాలు ఇంకుతున్న దాఖలాలు లేవని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూగర్భజలాల పెంపునకు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



జలదంకి యాదవ వీధిలో నీరు లేక వదిలేసిన బావి

నీళ్లు తగ్గేవి కావు



పది, పనెండేళ్ల క్రితం రోజంతా పంటలకు నీరు పెట్టినా బోవుల్లో నీరు తగ్గేవి కావు. ప్రస్తుతం బోర్ల ద్వారా పంటలు సాగు చేసుకుంటున్నాం. బోర్ల నుంచి కూడా నీరు సక్రమంగా రావడం లేదు. సోమశిల ప్రాజెక్టు ద్వారా నీరు అందితేనే పంటలు పండే పరిస్థితి నెలకొంది.

– రఘురామిరెడ్డి, చామదల

బావులు కనుమరుగు



నేల బావులు పూర్తిగా కనుమరుగయ్యాయి. మా చిన్నతనంలో నేల బావులు ఎప్పుడూ నిండుగా ఉండేవి. ప్రస్తుతం నేలబావులు అక్కడక్కడ ఉన్నా చుక్కనీరు లేకుండా ఎండిపోయి ఉన్నాయి. ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి. గతంలో పెద్దలు బావుల్లో చిన్నారులకు ఈత నేర్పేవారు. ఇప్పుడు చాలామందికి ఈత రాదు. భూగర్భజలాలను సంరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలు ఎంతో ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

–మాల్యాద్రి, జలదంకి

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

సంగం: స్థానిక సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ కార్తీక్, జిల్లా వ్యవసాయధికారిణి సత్యవాణి శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జేసీ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్‌మిల్లులను ట్యాగ్ చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.వారి వెంట తహసీల్దార్ సోమ్లానాయక్, సొసైటీ సీఈఓ దస్తగిరి, సివిల్ సప్లయీస్, వ్యవసాయాధికారులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

మంచి అలవాట్లతోనే నాడీవ్యవస్థకు రక్షణ

బిట్రగుంట: మంచి ఆరోగ్య అలవాట్లు, మిత వ్యాయామం, ఒత్తిడి లేని జీవనశైలితోనే నాడీవ్యవస్థకు సహజ రక్షణ లభిస్తుందని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ పేర్కొన్నారు. కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నాడీ వ్యవస్థ, ఆరోగ్య రక్షణపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెదడు, నాడీవ్యవస్థ, నరాలకు సంబంధించిన వ్యాధులు, నివారణ, ముందస్తు జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాడీ వ్యవస్థ అనారోగ్యానికి గురైతే బ్రెయిన్‌స్ట్రోక్, మతిమరుపు, శరీరంలో వణుకు, నడకలో తేడాలు, మాటలు తడబడడం, తదితర సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, మిత వ్యాయామం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, షుగర్, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, మొబైల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి, ఏఓ ఆర్వీ రమణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అపోలో ఆస్పత్రి కావలి జోన్ పీఆర్వో మాధవ, తదితరులు పాల్గొన్నారు.



మాదిగ అమర వీరులకు నివాళులు



కొండాపురం: సాయిపేట ఎస్సీకాలనీలో ర్యాలీ



వింజమూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి)/కొండాపురం/అల్లూరు: వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగల హక్కుల కోసం పోరాడి అమరులైన అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేడ్కర్ మాదిగ, ఆనంద్, మంద సుజాత, సుధాకర్, చినపెంచలయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాపురం మండలం సాయిపేట ఎస్సీకాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అలాగే అల్లూరులోని అరుంధతీయవాడలో ఎమ్మార్పీస్ పట్టణాధ్యక్షుడు దర్శిగుంట కోటయ్యమాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోచిపాతల వెంకటేశ్వర్లుమాదిగ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వరికుంటపాడు: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ పీ పెంచలనరసింహారావు అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి వందరోజుల ప్రణాళిక అమలు తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. వరికుంటపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం తెలుగు ఉపాధ్యాయిని సుభద్ర తన సొంత నిధులతో నిర్మించిన డైనింగ్‌హాల్‌ను పరిశీలించి అభినందించారు. ఎంఈఓ రమణయ్య, హెచ్‌ఎంలు మాలకొండయ్య, మౌలాలి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ఆత్మకూరు/చేజర్ల: పవిత్ర రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంకను దర్శించిన ముస్లిం మతపెద్దలు రంజాన్ ఉపవాస దీక్షలను ఆదివారం ఉదయం నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దీంతో ఆత్మకూరు, చేజర్ల మండలాల్లోని ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శుభాకాంక్షలు

రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులపై అల్లాహ్ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

ఘనంగా వెన్నవాడ పాఠశాల వార్షికోత్సవం

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంతో గొప్పస్థాయిలో ప్రతిభ కనబర్చడంలో హెచ్‌ఎం రవీంద్రకుమార్, ఉపాధ్యాయిని, విద్యార్థుల తల్లిదండ్రులు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు. అనంతరం పౌరాణిక, జానపద, సాంఘిక కార్యక్రమాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రమీల, జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలల సంఘ అధ్యక్షుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి, అకడమిక్ మానటరింగ్ అధికారి సుధీర్‌బాబు, తెలుగుభారతి సేవా సమితి ప్రతినిధులు యానాదిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ రమణయ్య, ఉపాధ్యాయిని జీవని, సర్పంచ్ జగన్నాథం ఆదిలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథం ప్రసాద్, దశించర్ల ప్రసాద్ నాయుడు, రేవూరు విజయ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



కంచి పరమేశ్వరరెడ్డికి జ్ఞాపిక బహూకరణ

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: ఎస్‌బీఐ నూతనంగా ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజరు మహమ్మద్ మున్వర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న బీమా పథకానికి సవరింపులు చేస్తూ కొత్త పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.2వేలు ప్రీమియం చెల్లిస్తే పాలసీదారుడు ఏదైనా ప్రమాదం సంభవించి అంగవైకల్యం చెందినా, మరణించినా రూ.40 లక్షలు పరిహారం అందుతుందని వివరించారు. ప్రమాదం జరిగిన సమయంలో అంబులెన్స్ ఖర్చులు సైతం చెల్లిస్తారని చెప్పారు. మరణించిన వారి కర్మక్రతువులకు ఆర్థిక సాయం అందజేస్తారని వివరించారు.

బెంగళూరుకు నూతన సర్వీస్ ప్రారంభం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరుకు నూతన సర్వీసును డిపో మేనేజర్ కరీమున్నీసా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు రాత్రి 6.30 గంటలకు ఆత్మకూరులో బయలుదేరి వేకువజామున బెంగళూరుకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. రాయచోటి నుంచి బెంగళూరు వరకు నాన్‌స్టాప్ సర్వీసుగా నడుస్తుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

ఉదయగిరి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయిలో జరుగుతున్న సదరమ్ సర్టిఫికెట్లు, దివ్యాంగుల పెన్షన్ల పరిశీలన కార్యక్రమాన్ని ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీఓ అప్పాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య పెన్షన్లు, సదరమ్ నవీకరణ, డిజిటల్‌సైన్ పూర్తి చేయనున్న దృష్ట్యా వాయిదా వేయడం జరిగిందన్నారు. తిరిగి రెండో వారంలో వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు.

హామీలకు అరకొరగా నిధులు



కూనం తాతిరెడ్డి

కావలి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో అరకొరగా కేటాయించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్ సంస్థ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే దానిపైన స్పష్టత లేదని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ఆత్మకూరు విద్యార్థి సత్తా



మనోజ్‌జశ్వంత్

ఆత్మకూరు: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరులోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కందుకూరు మనోజశ్వంత్ సత్తా చాటాడు. హర్యానాలో గురు, శుక్రవారాల్లో జరిగిన 37వ జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర జట్టులో జశ్వంత్ ప్రతిభకనబర్చి జట్టు విజయానికి దోహదపడడంపై పాఠశాల కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి జాబితాను విడుదల చేసింది. యూత్ వింగ్‌కు బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి, మహిళా విభాగానికి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, రైతు విభాగానికి ఏటూరు రఘురామిరెడ్డి, బీసీసెల్‌కు చెవుల శ్రీనివాసులు, ఎస్టీ సెల్‌కు మాణికల చందు, ముస్లిం మైనార్టీ సెల్‌కు షేక్ సందానీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు నందవరం ప్రతాప్, పంచాయతీరాజ్ వింగ్‌కు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మున్సిపల్ వింగ్‌కు చెరుకూరు కామాక్షయ్యనాయుడు, ఆర్‌టీఐకు సానా వేణుగోపాల్‌రెడ్డి, వలంటీర్ వింగ్‌కు వంటేరు సుధీర్‌రెడ్డి, గ్రీవెన్స్‌సెల్‌కు మన్నెం దశరథరామిరెడ్డి, వాణిజ్య విభాగానికి రాచపూడి రమేష్, వైఎస్సార్‌టీయూసీకి కూరపాటి ప్రసాద్‌రెడ్డి, లీగల్‌సెల్‌కు నందా ఓబులేసు, కల్చరల్ వింగ్‌కు చీర్ల శ్రీనివాసులు, సోషల్ మీడియా వింగ్‌కు వీ బాలఅంకయ్య, ఐటీ వింగ్‌కు జీ నాగార్జున రెడ్డి, పబ్లిసిటీ వింగ్‌కు అంబటి కృష్ణారెడ్డి, దివ్యాంగుల విభాగానికి షేక్ షబ్బీర్, ఇంటెలెక్చువల్ ఫోరానికి ఏ కోటిరెడ్డి, బూత్ కమిటీ వింగ్‌కు సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి నియమితులయ్యారు.

బడ్జెట్‌లో మెట్టప్రాంతాలకు తీరని అన్యాయం

ఉదయగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో వెనుకబడిన మెట్టప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు విషయంలో తీరని అన్యాయం జరిగిందని రాష్ట్ర వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర కార్యదర్శి మాదాల శ్యామ్‌ప్రసాద్ ఖండించారు. శనివారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. దశాబ్దాల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే మెట్టప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వ వైఖరి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్న 60శాతం మంది ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. మెట్టప్రాంతంలోని మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించి పూర్తిచేయాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టడం అప్రజాస్వామికమన్నారు. వెలిగొండ, సోమశిల హైలెవల్ కెనాల్‌కు కనీస నిధులు కేటాయించాలని, లేకపోతే మెట్టప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, పీవీ రమణయ్య, మాల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కావలి: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన అగ్నిప్రమాద బాధితులు గుంజి వెంకటేశ్వర్లు, కోటేశ్వరి దంపతులకు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గత నెల నెల 26న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూరిల్లు కాలిపోవడంతో వెంకటేశ్వర్లు దంపతులు సర్వస్వం కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధితులను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన రూ.25వేలు నగదు సాయాన్ని అందజేశారు. అలాగే పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ రూ.5వేలు చొప్పున నగదును అందజేశారు. నాయకులు అన్నపూర్ణ శ్రీనివాసులు, లక్ష్మణరావు, మండలి కృష్ణారావు, కలికి శ్రీనివాసులురెడ్డి, షేక్ పార్థు, పామంజి శ్యామ్, వల్లెపు రమేష్, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, షేక్ షాహుల్‌హమీద్, చిరంజీవిరెడ్డి, కోదండం, గిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న శివకుమార్‌రెడ్డి, కేవీ నారాయణ

వెంగమాంబ ఆలయంలో వేలంపాటలు

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులకు బహిరంగ వేలంపాటలను శనివారం నిర్వహించారు 1 నుంచి 15, 20 నుంచి 27 వరకు గల దుకాణాలకు మూడేళ్ల లీజు కాలపరిమితితో వేలంపాటలు నిర్వహించగా ఏడాదికి రూ.4,56,700 చెల్లించేలా పలువురు దక్కించుకున్నారు. అలాగే కొబ్బరిచిప్పలు విక్రయ హక్కును కొప్పవరపు సుబ్రహ్మణ్యం రూ.5,85,000కు దక్కించుకున్నారు. వివిధ కారణాలతో మిగిలిన వేలంపాటలు వాయిదా వేశారు. ఈవోలు కవిత, ఉషశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మోటార్ వాహన చట్టం అమలు

- ఉల్లంఘిస్తే జరిమానాలు, లైసెన్స్‌లు రద్దు

నెల్లూరు(క్రైమ్): రహదారి ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ చట్టాన్ని జిల్లాలో మార్చి 1 నుంచి పోలీస్ యంత్రాంగం పటిష్టంగా అమలు చేస్తోంది. నిబంధనలను ఉల్లంఘిస్తే సవరించిన జరిమానాలు విధించడంతో పాటు పదేపదే ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను సైతం రద్దు చేయనున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసులకు వాహనదారులు సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. ద్విచక్రవాహనచోదకుడితో పాటు వెనుక కూర్చున్న వారూ హెల్మెట్‌ను విధిగా ధరించాల్సి ఉంటుంది. ఇతర వాహనాలు నడిపే వారితో పాటు కో ప్యాసింజర్ సైతం సీటు బెల్టును ధరించాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, రవాణా శాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారమిచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేయనున్నారు.

పెనాల్టీలిలా..

ఉల్లంఘన	సవరించిన జరిమానా (రూపాయల్లో)
హెల్మెట్ లేకపోతే	1000
వెనుక కూర్చున్న వ్యక్తికి లేకపోతే	1000
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే	5000
ఇన్సురెన్స్ సర్టిఫికెట్ లేకపోతే	2000 (మొదటిసారి), 4000 (రెండోసారి)
పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే	1500
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1500 (మొదటిసారి), 10000 (రెండోసారి)
నంబర్ ప్లేట్ సక్రమంగా, వాహన పత్రాల్లేకపోయినా	150 (మొదటిసారి), 300 (రెండోసారి)
సీటుబెల్ట్ ధరించకపోతే	1000
రిజిస్ట్రేషన్ లేకపోయినా, రెన్యువల్ చేయకపోయినా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా	2000 (మొదటిసారి), 5000 (రెండోసారి)
రేసింగ్	5000 (మొదటిసారి), 10000 (రెండోసారి)
మితిమీరిన వేగం	1000
ట్రిపుల్ రైడింగ్	1000